ఓంశ్రీసాయిరాం

సద్విద్య ఉన్నచో సంస్కారమదియబ్బు
సంస్కారమున్నచో జన్మమదియె
సద్విద్య ఉన్నచో సౌఖ్యంబు చేకూరు
సౌఖ్యంబు వల్లనే శాంతి కల్గు
సద్విద్య ఉన్నచో సత్సంగములు కల్గు
సత్సంగమున్నచో శాంతి అదియె
సద్విద్య ఉన్నచో జన్మ సార్థకమగు
జన్మ సార్థకముచే ముక్తి కల్గు
సత్యనిత్యమైన చదువు చదివినపుడె
సార రహితమౌ సంసార సాగరమున
మునిగి తేలక త్వరలోనె మోక్షమందు
కాన యిటువంటి చదువుకై కదలిరండు.

'విద్యా దదాతి వినయం'. విద్య వినయప్రదాత. వినయమనగా కేవలము శిరోనమ్రత కాదు. అహంకార, ఆడంబర రహితమైన మనోనిశ్చలతయే నిజమైన వినయం. ఇట్టి పవిత్రమైన వినయమును పిల్లలకు అధ్యాపకులుగాని, తల్లిదండ్రులుగానినేర్పలేకపోతున్నారు. కారణమేమిటి? అట్టి వినయాన్ని తాము పొందలేకపోయినందుకే వారు పిల్లలకు నేర్పలేకపోతున్నారు. 'వాటర్ ట్యాంక్'లో ఏవిధమైన నీరు వుంటుందో, ట్యాప్స్‌లోకూడా అదే నీరు వస్తుంది. ఈనాటి అధ్యాపకులు, తల్లిదండ్రులు కూడా పవిత్రమైన భావములతో తమ హృదయాలనే ట్యాంకులను నింపుకోలేకపోతున్నారు. అట్టివారు పిల్లలకు వినయ తత్త్వాన్ని ఏరీతిగా బోధించగలరు?

నిప్పును సరిగా పోషించినప్పుడు అది ప్రకాశమును, వెచ్చదనమును మనకు అందిస్తుంది. కాని, నిప్పును అలక్ష్యం చేసినప్పుడు దానిపై నివురు కప్పి దానిని మరుగు పర్చుతుంది. ప్రతీ మానవునియందు పవిత్రమైన జ్ఞానాగ్ని దాగివున్నది. అదే మంచి మనస్సు. కాని, ఈనాడు లౌకికవాంఛలనే నివురు కప్పటంచేత జ్ఞానాగ్నిని మనం చూడలేకపోతున్నాము. నివురును ఊదితే నిప్పు కనిపిస్తుంది. 'ఆధ్యాత్మ విద్యా విద్యానాం' అన్నాడు కృష్ణుడు. 'విద్యలలో ఆధ్యాత్మిక విద్య నేనే' అన్నాడు. అలాంటి ఆధ్యాత్మిక తత్త్వాన్ని అనుభవించి, ఆనందించి జగత్తుకు అందించిన మహనీయులెందరో ఈ భారతదేశ పుత్రులుగా జన్మించారు. కాని, అట్టి ఆదర్శపురుషుల తత్త్వాన్ని ఈనాటి మానవులు విస్మరించారు.

రాతిని రూపంగా తీర్చిదిద్దునది శిల్పి, భావాన్ని రూపంగా తీర్చిదిద్దునది భాష, మానవుని ఉత్తమునిగా తీర్చిదిద్దునది శీలము. అదేవిధంగా, బాలబాలికలను ఆదర్శప్రాయులుగా తీర్చిదిద్దునది అధ్యాపకుడే. 'బ్రతకలేనివాడు బడిపంతులని' అంధులైనవారు, అజ్ఞానులైనవారు అనుచుందురు. కాని, బ్రతుకు నేర్పువాడే అధ్యాపకుడు. సత్ప్రవర్తనమును చక్కగా బోధించి, ముందు దారిని బాగా అందజేసి సమతమమతలు పెంచి సన్మార్గమును చూపు సద్గుణవంతుడే గురువు.

కాని, ఈనాడు గురువులను ఏదో చిన్న ఉద్యోగస్తులుగా భావించి అలక్ష్యంగా చూస్తున్నాము. మానవ జీవితానికి రాజబాటను ఏర్పరచువారే అధ్యాపకులు. మానవత్వాన్ని వికసింపజేసేవారే అధ్యాపకులు. దేశమునకు దివ్యజ్యోతులను అందించువారే అధ్యాపకులు. అధ్యాపకులు మహా ఆదర్శమూర్తులు,ఆదర్శజ్యోతులు. అధ్యాపకులనే జ్యోతులు నిరంతరమూ వెలుగుతున్నప్పుడే విద్యార్థులనే జ్యోతులను వెలిగించటానికి వీలౌతుంది. కనుక, అధ్యాపకులారా! మీ దివ్యమైన భావములను, ఆదర్శవంతమైన సూక్తులను పిల్లలకు అందించే నిమిత్తమై మీరు నిరంతరమూ కృషిచేయవలసి వుంటుంది.

అధ్యాపకులు 'గైడ్ పోస్ట్' వంటివారు. వీరు సరియైన స్థితిలో వున్నప్పుడే బాలబాలికలనే ప్రయాణీకులకు దివ్యజీవితాన్ని, దీర్ఘజీవితాన్ని కూడా అందించిన వారౌతారు. ఈ భౌతికమైన జీవితంతో పాటు దీనికి ఆధారమైన ఆధ్యాత్మిక జీవతంకూడా మనకు అత్యవసరం. అట్టి ఆధ్యాత్మిక తత్త్వాన్ని విద్యార్థులకు బోధించి ఆదర్శమూర్తులుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత అధ్యాపకులపైనే కాదు, తల్లిదండ్రులపైన, ప్రభుత్వంపైన కూడా వుంటున్నది.

విద్యార్థులకు మూడు గుణములు ప్రధానంగా వుంటుండాలి. 1. సర్వలోక హితే రతః. అనగా లోకక్షేమాన్ని కోరే స్వభావం విద్యావంతులలో వుండాలి. 2. సర్వే జ్ఞాన తతో రతః. అనగా సర్వజ్ఞానములనూ ఇష్టపడేవాడుగా వుండాలి. 3. సర్వే సముదితా గుణైః

. సమస్త సద్గుణములనూ కలిగినవాడుగా వుండాలి. ఏనాడైతే వ్యక్తిత్వం సార్థకమగునో ఆనాడే సమాజంకూడా అభివృద్ధి చెందుతుంది. సమాజ కల్యాణం జరిగినప్పుడే దేశముకూడా సుక్షేమాన్ని పొందుతుంది. కనుక, వ్యక్తి సమాజ దేశ క్షేమములన్నీ మానవత్వము పైననే ఆధారపడియున్నవి.

రామునికంటె రావణుడు అనేక విద్యలు అధికంగా నేర్చినాడు. కాని, రామాయణాన్ని రచించిన వాల్మీకి రావణుని ఏమని వర్ణించాడు? 'రావణుడు ఒక మూర్ఖుడు' అన్నాడు. దేని వలన? ఎన్నో విద్యలు నేర్చినప్పటికీ రావణుడు ఇంద్రియములకు దాసుడై కోరరాని కోరికల చేత తనతోపాటు తన వంశమును, రాజ్యమును కూడా భస్మం గావించుకొన్నాడు. కనుక, విద్యలు నేర్చినంత మాత్రమున, 'ఇతడు విద్యావంతుడు' అని చెప్పవచ్చునుగాని, 'ఇతడు జ్ఞాని' అని చెప్పటానికి వీలుకాదు. అలౌకికమైన ఆత్మతత్త్వాన్ని ప్రకాశింపజేయునదే నిజమైన జ్ఞానము. నేర్చిన విద్యలను అదుపులో వుంచుకొని ఇంద్రియనిగ్రహము గావించుకొని సత్యవాక్పరిపాలన చేత లోకక్షేమాన్ని దృష్టియందుంచుకొని ఆదర్శమూర్తులుగా రూపొందాలి.

విద్యయొసగును వినయంబు
వినయము వలన కలుగు పాత్రత
పాత్రత వలన ధనము ధనము వలన ధర్మంబు
దాని వలన కలుగు నరునకు సుఖంబు.

కనుక, వినయమొక్కటి వుంటే ఎంతైనా మనం సాధించవచ్చు. అదే మానవతా గుణము. మంచి మనస్సే మానవతా గుణము.

మానవ హృదయమంతా కరుణతో కూడినటువంటిది. హృత్ + దయ = హృదయ. కాని, ఈనాటి మానవులు కఠిన హృదయులై ప్రవర్తిస్తున్నారు. నిర్దయులుగా జీవిస్తున్నారు. కట్టకడపటికి నిరాశానిస్పృహలకు గురైపోతున్నారు. ప్రకృతి మనకు ఎన్నో విధములైన త్యాగభావములను బోధిస్తున్నది. మట్టి, నీరు, నిప్పు, గాలి ఇవన్నీ స్వార్థరహితమైన భావముతో మానవత్వాన్ని పోషిస్తున్నవి. మట్టి మనకు ఆహారాన్ని చేకూర్చుచున్నది. నీరు మన ప్రాణాన్ని పోషించి దేశాన్ని సస్యశ్యామలం గావించుచున్నది. సూర్యుడు ప్రాణశక్తిని, ప్రకాశమును చేకూర్చుచున్నాడు. ఈవిధంగా, ప్రకృతి ఎన్నో సేవలు సల్పుచుండగా, ఇట్టి ప్రకృతి ఒడిలోనే పుట్టిన మానవునకు ఈ కారుణ్యము ఎక్కడపోయినది? ప్రకృతినుండి పుట్టిన మానవునకు ప్రకృతి స్వభావములు కూడా దూరమైపోయినవి.

ఈనాడు మానవుడు కేవలం విద్యావంతుడేగాకుండా జ్ఞాని కావాలి. విద్యతోబాటు గుణము వుండాలి. గుణముతోబాటు ప్రవర్తనకూడా బాగుండాలి. The proper study of mankind is man. అన్నారు. హృదయములోని భావము, మాటలోని సూచన, చేతిలోని ఆదర్శము – ఈ మూడూ ఏకం కావాలి. ఈనాటి మానవుడు పుస్తకాన్ని మస్తకంగా మార్చుకుంటున్నాడు. కాని, మస్తకంలోనిది హస్తములో పెట్టటం లేదు. పుస్తకము, మస్తకము, హస్తము – ఈ మూడింటి ఏకత్వమే మానవత్వము.

అధ్యాపకులారా! భవిష్యత్తును తీర్చిదిద్దవలసిన బాధ్యత మీ అందరిపైనా వుంటున్నది. ఈ జగత్తులో అనేకవిధములైన కాన్ఫరెన్సులు జరుగుతుంటాయి. కాని, ఇతర కాన్ఫరెన్సులకు, మన కాన్ఫరెన్సులకు చాలా వ్యత్యాసం వుంటున్నది. బయట జరిగే కాన్ఫరెన్సులలో పాల్గొనేవారు పిక్నిక్కు వెళ్ళినట్లుగా, site-seeing కు వెళ్ళినట్లుగా వెదుతుంటారు. ఇది మంచిది కాదు. ఎంతో ధనం ఖర్చుపెట్టి, ఎంతో దూరం ప్రయాణించి మనం చేయవలసినది ఇది కాదు. యావద్భారతదేశము నలుమూలల నుండి అధ్యాపకులు ఒకరితోనొకరు స్నేహం చేసుకోటానికి కాదు. ఏకత్వాన్ని చాటే నిమిత్తమై ఇక్కడకు చేరుకొన్నారు. మన దివ్యత్వాన్ని చాటి పదిమందికి పంచినప్పుడే మన మానవత్వం సార్థకమౌవుతుంది. 'నేను, నా వారు' అనే భావనచేత మానవత్వం పూర్ణత్వాన్ని పొందజాలదు. మూడవదైన సమాజము కూడా వున్నదనే సత్యాన్ని గుర్తించాలి.

మీరు ఆచార్యుడు అన్న పేరుతో సార్థకనామధేయులై వుండాలి. ఆచార్య- అనగా ఆచరించేవాడు. కాని, మనం చెప్పినవి ఆచరించకుండా వుంటే- అది కృత్రిమజీవితంగా వుంటుంది. heart is inside, art is outside. కనుక, మనం heart గా వుండాలిగాని art గా వుండకూడదు. మన పిల్లలనుకూడా ఈవిధమైన ఆదర్శవంతులుగా తయారుచేయాలి. అదే నిజమైన సాధన. ఒక విద్యార్థి చెడిపోతే, తాను మాత్రమే చెడిపోతాడు. కాని, ఒక అధ్యాపకుడు చెడిపోతే అనేక వందలమంది విద్యార్థులు చెడిపోతారు. కనుక, ఏ విద్యార్థీ పెడమార్గం పట్టకుండా చూచుకోవాలి. అప్పుడప్పుడు తల్లిదండ్రులనుకూడా కలుసుకొని పిల్లల ప్రవర్తన ఏరీతిగా వున్నదో తెలుసుకొని వారిని సరైన మార్గములో త్రిప్పటానికి కృషిచేయాలి.

నిజంగా మన అధ్యాపకులు చాలా మంచివారు. ఎంతో శ్రమలకోర్చి సేవలు చేస్తున్నారు. తమ ఇంటియందు ఎన్నో అవస్థలున్నప్పటికీ వాటిని లెక్కచేయకుండా స్వామి సేవలో, విద్యార్థులకు బోధించటంలో తమ కాలాన్ని సార్థకం గావించుకుంటున్నారు. అదే ఒక సాధనగా భావిస్తున్నారు. నిజంగా అధ్యాపకులు, సేవాదళంవారు, సెక్యూరిటీవారు ఎంతో

త్యాగముతో, ఎంతో ప్రేమభావముతో సేవలు చేస్తున్నారు. ఏ ఇతర సంస్థయందు ఇటువంటిది జరగటం లేదు. తమకు ఎన్ని కష్టములున్నప్పటికీ తమ ధనముచేతనే ప్రయాణించి వస్తున్నారు. తమ ధనముచేతనే ఆహారాన్ని తీసుకుంటున్నారు. సత్యసాయి ట్రస్టుగాని, సత్యసాయి సమితులుగానీ ఈ అధ్యాపకులకు నయాపైసకూడా ఇవ్వటం లేదు. వారుకూడా తీసుకోటం లేదు. ఏకాగ్రతతో కూడిన చిత్తముతో వారు తమ జీవితాన్ని ఆనందంగా గడుపుతూ వస్తున్నారు. కాని, ఇంతటితోనే తృప్తిపడరాదు. ఇంకా అనేకవిధములైన సేవలను అభివృద్ధి పర్చుకొని విద్యార్థులలో మానవతా గుణములను చేర్చే నిమిత్తమై ఏవిధంగా మనం ప్రవర్తించాలి అని యోచన చేయాలి.

*సత్యధర్మప్రేమశాంతులు లేకున్న*
*విద్యలన్నియు నేర్చి విలువ సున్న*
*సత్యధర్మప్రేమశాంతులు లేకున్న*
*దానధర్మాల సార్థకత సున్న*
*సత్యధర్మప్రేమశాంతులు లేకున్న*
*పదవులనేలిన ఫలము సున్న*
*సత్యధర్మప్రేమశాంతులు లేకున్న*
*బహుళ సత్కార్య లాభంబు సున్న*
*మన సనాతన ధర్మ హర్మ్యంబు నిలువ*
*గుణములివి నాల్గును పునాది గోడలప్పు*
*ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు*
*సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!*

*ప్రేమతో పలికేదంతా సత్యమే*
*ప్రేమతో చేసేదంతా ధర్మమే*
*ప్రేమతో తలచినదంతా శాంతమే*
*ప్రేమతో అర్థంచేసుకోటమే అహింస.*

కనుక, ఈ సత్య, ధర్మ, శాంతి, అహింసలకు ప్రేమ అంతర్వాహినిగా వుండాలి. love is God, live in love. ఇదే మనమీనాడు చేయవలసినది.

పాపభీతి, దైవప్రీతి, సంఘనీతి – ఈ మూడే మానవతా గుణములు. ఈ మూడింటినీ వదలితే మన ప్రాణమున్నా ప్రయోజనం లేదు. సమాజములోనున్న దివ్యత్వాన్ని గుర్తించక ఏకాకి జీవితం గడిపేవాడు మానవుడే కాదు. ఈ యూనిటీ వున్నప్పుడే మనలో ప్యూరిటీ ఆవిర్భవిస్తుంది. ప్యూరిటీ వున్నప్పుడే డివినిటీని పొందుతాము. మొట్టమొదట ఈ యూనిటీ, ప్యూరిటీ, డివినిటీ, మూడింటి తత్త్వాన్ని మనం అర్థం చేసుకోవాలి. దేశములెన్ని వున్నప్పటికి భూమి ఒక్కటే.

nations are many, earth is one
beings are many, breath is one
jewels are many, gold is one.

చూశారా! ఈవిధమైన ఏకత్వాన్ని భావించినప్పుడు ద్వేషానికి అవకాశమే లేదు. అనాది కాలమునుండి భారతదేశము ఈవిధమైన ఆదర్శాలనెన్నింటినో అందిస్తూ వచ్చింది.

ప్రతి కష్టములోనూ మనం సుఖాన్నే అనుభవించాలి. దీనిని చక్కగా అనుభవించవచ్చు. ఏరీతిగా? నీకొక తేలు కుట్టింది. 'అయ్యో! నన్ను తేలు కుట్టింది' అని నీవు ఏడ్వనక్కరలేదు, పాము కరువలేదని ఆనందించు. ఒకవేళ పాము కరిస్తే, 'పాము కరిచిందే!' అని బాధపడవద్దు, ప్రాణం పోలేదని ఆనందించు. 'కార్లు లేవే' అని బాధపడవద్దు, కాళ్ళున్నాయని అనందించు. కోట్లు లేవని బాధపడవద్దు, కూటికి వున్నదని ఆనందించు. ఇదియే దుఃఖములోనున్న ఆనందము. దీనిని అనుభవించటమే సరియైన ఆదర్శము.

నిజమైన కోటీశ్వరుడెవరు? కోరికలు లేనివాడే కోటీశ్వరుడు. కాని, ఈనాడు మన కోరికలు మితిమీరిపోతున్నాయి. అందుచేత 'celing on desires' అనే అంశాన్ని విద్యార్థులకు బోధించాలి. 'boy! food is God, do not waste food' అని చెప్పాలి. ఫుడ్ లేక బాధపడేవారు ఎంతోమంది వుంటున్నారు ఈ లోకంలో. కనుక, నీకెంత అవసరమో అంతే తీసుకో. ఇది 'celing on desires' లో మొట్టమొదటిది. ఇంక, రెండవది ధనము. wealth is God. misuse of money is evil. So, boy! do not waste money' అని చెప్పాలి. తండ్రి సంపాదించిన ధనములో ప్రతీ దుడ్డును ఒక 'బ్లడ్ డ్రాప్' గా భావించుకోవాలి. కనుక, ఒక్క

నయాపైసనైనా నీవు వ్యర్థం చేస్తే, తల్లదండ్రుల రక్తపు చుక్కలను వ్యర్థం చేసినవాడవౌతావు.ఈ విషయాన్ని పిల్లలకు చక్కగా బోధించాలి.

ఇంక, 'don't waste time, time is God' కాలమును వ్యర్థం చేస్తే మన జీవితమే వ్యర్థమైపోతుంది. కాబట్టి, 'boy! don't waste time, time waste is life waste' అని చెప్పాలి. ప్రతి క్షణమునూ సద్వినియోగపరచే మార్గములో పిల్లలను ప్రవేశపెట్టాలి. 'అనవసరంగా మాట్లాడకూడదు. talk less, work more. ' అని పిల్లలకు చెప్పాలి. మాటలు అధికం కావటం చేతనే మనలోని శక్తి క్షీణించిపోతున్నాది. తద్వారా జ్ఞాపకశక్తి తగ్గిపోతున్నాది. అంతేకాకుండా, అతిత్వొందరగా వృద్ధాప్యము ప్రారంభమౌతున్నది. అందుచేతనే పవిత్రమైన మహనీయులంతా మౌనాన్ని పాటించేవారు.

పిల్లలకు మీరు చక్కగా బోధించాలి.

See no evil, see what is good,
Hear no evil, hear what is good,
Think no evil, think what is good,
Talk no evil, talk what is good,
Do no evil, do what is good,
This is the way to God.

అని చెప్పాలి. ఇట్టి పవిత్రమైన మార్గాలను పిల్లలకు చిన్నతనమునుండే నేర్పాలి. మొక్క చక్కగా వుంటేనే, వృక్షముకూడా చక్కగా పెరుగుతుంది. మొక్క సొట్టైతే వృక్షముకూడా సొట్టగానే వుంటుంది. కనుకనే, Start early, drive slowly, reach safely.

ఈవిధమైన చిన్నచిన్ని పదాలతో పిల్లల హృదయాలకు హత్తుకొనే రీతిగా మీరు బోధించాలి.

ఇంక నాల్గవది. Don't waste energy. దీనిని వ్యర్థం చేయటం వలన ఈనాటి పిల్లలు చాలా బలహీనులైపోతున్నారు. ఈ బలహీనత వల్లనే తల్లిదండ్రుల మాటలను కూడా వినలేకపోతున్నారు. దారి తప్పిపోతున్నారు. బ్రేకులు లేని కార్లుగా తయారైపోతున్నారు. 'కాడి క్రిందకు రాని ఎద్దు, కళ్ళెము లేని గుఱ్ఱము, ఇంద్రియనిగ్రహము లేని జీవితము' ఇవన్నీ బ్రేకులు లేని కార్లవంటివి. ఇటువంటి వారికి ఏ ప్రమాదమైనా సంభవించవచ్చు. కనుక, ఇంద్రియనిగ్రహానికి తగిన శక్తి సంపాదించుకోవాలి.

ఈనాటి రాజకీయ నాయకులంతా పిచ్చివారుగా తయారైపోతున్నారు. ఒక వ్యక్తికి మరొక వ్యక్తిపై ఆశ కలిగితే, అప్పుడు యోచించాలి.'నా దేహంలో వున్నవి పంచేంద్రియాలే, ఆ దేహంలో వున్నవికూడా పంచేంద్రియాలే. నా దేహము మలమూత్ర దుర్గంధ మాంసరక్తమయమే, ఆ దేహముకూడా అటువంటిదే. మరి ఎందుకు నేను నాలో వున్న వాటినే తిరిగి ఎందుకు ఆశించాలి? కనుక, నాకు ఇది అక్కరలేదు. అన్నీ నాలోనే వున్నాయి' అనే సత్యాన్ని గుర్తించాలి. ప్రపంచమంతా నీ హృదయములోనే వుంటున్నది. కన్నులు తెరిస్తే ప్రపంచం కనిపిస్తుంది, కన్నులు మూస్తే ఏమీ కనిపించదు. కాబట్టి, ప్రతి ఒక్కటీ reflection of the inner being మాత్రమే! ఈ సత్యాన్ని పిల్లలకు బోధిస్తూ రావాలి. ఏవిధమైన కఠిన పదములు కూడా పిల్లల నోటినుండి రాకుండా చూడాలి. 'boys & girls! you can not always oblige but you can always speak obligingly. కనుక, మంచిగా, నెమ్మదిగా, హాయిగా మాట్లాడండి' అని చిన్నతనమునుండే బోధించాలి. ఈనాటి పిల్లవాడు తల్లి ఏదైనా చెప్పబోతే, 'don't talk, I know everything' అంటాడు. దీనికి కారణం ఎవరు? తల్లియే! ఎందుకంటే, ప్రారంభమునుండి ఆ పిల్లవానిని సరియైన రీతిగా పెంచలేదు. పిల్లవానిని స్కూలులో చేర్చినంతనే తమ బాధ్యత తీరిపోయినదని భావిస్తున్నారు తల్లిదండ్రులు. ఇది చాలా పొరపాటు. తల్లిదండ్రులుకూడా తగిన బాధ్యత వహించాలి.

ప్రేమస్వరూపులారా! మీరు అనేక శ్రమలకు, అననుకూలములకు, కష్టనష్టములకు ఓర్చుకొని ఈ సమావేశములో పాల్గొని దివ్యమైన దైవత్వాన్ని నిరూపిస్తూ వచ్చారు. ఇదే ఒక సాధనగా భావించాలి. 'శరీర మాద్యం ఖలు ధర్మ సాధనం'. ఇట్టి సాధనకోసం వచ్చినటువంటిదే ఈ దేహము. 'కష్టే ఫలే'. కష్టములయందే సుఖము వుంటున్నది. సుఖములనుండి సుఖము లేదు. కష్టములనుండే సుఖము వుంటున్నది. దీనినే వేదాంతమునందు, 'న సుఖాత్ లభ్యతే సుఖం' అన్నారు. 'పిలిచి అడుగ చెఱకు పెట్టునా బెల్లంబు–పిప్పిగొట్టి రసము పీల్చుకున్న'. వజ్రమును కూడా అనేకవిధములుగా కోసినప్పుడే దాని విలువ అధికమౌతుంది.

మీకు సకాలమునకు సరైన నిద్రాహారములు లేక అనేక కష్టములను అనుభవించారు. కాని, ఇది సేవలో ఒక భాగము. 'త్యాగేనైకే అమృతత్వ మానశుః'. మానవునకు త్యాగము అత్యవసరము. ప్రేమ, త్యాగములు రెండే మానవుని నేత్రములు. కనుక, మీరు ఏవిధమైన త్యాగము చేసినప్పటికీ దానిని భగవత్కార్యముగా భావించాలి. work will be transformed into worship. మీరు ఏ పని చేసినా దానిని పూజగానే భావించాలి.

అనేకమంది అధ్యాపకులు తమతమ గృహ పరిస్థితులుగాని, సహజ పరిస్థితులుగాని సరియైన స్థితిలో లేకపోయినప్పటికీ– స్వామి సేవలో తమ ప్రాణములనే అంకింతం గావించి అనేక శ్రమలకోర్చి ఇక్కడకు చేరుకొన్నారు. ఇది మీ ఇల్లు. కనుక, మీ ఇంటికి మీరు చేరుకోటానికి ఎన్ని కష్టములనైనా సహించుకొని, భరించుకొని, తట్టుకొని, నెట్టుకొని ముందుకు సాగివస్తున్నారు. ఇన్ని శ్రమల కోర్చుకొని వచ్చిన అధ్యాపకులకు కొంతవరకైనా మా సెంట్రల్ ట్రస్టు సహాయం చేయాలి. నిజంగా భక్తులు ఎవరంటే – మీరే. మన సంస్థలోనున్న వర్కర్స్ త్యాగములు ఏ ఇతర సంస్థలోకూడా లేవు. అలాంటి వజ్రములవంటి వర్కర్స్‌గా వుంటున్నారు మీరు.

సేవాదళమువారు చేసే సేవలు చాలా అమోఘమైనటువంటివి. వాటిని ఏవిధముగాను వర్ణించటానికి వీలుకాదు. 'యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ' అని భగవంతుని అంటారుగాని, భగవంతుడు మీ స్వరూపమే! మానవుడే దేవుడు. ఈ దేహము దేవుని ఆలయము. ఇలాంటి భావమును మీరు పెట్టుకోవాలి. 'మా ఇంటికి మేము వచ్చాము. మేము చేయవలసిన పని మేము చేశాము' అని ఎవరి హృదయాలలో వారు భావించాలి. అంతేగాని, వేరే ఎక్కడికో పరాయి ఇంటికి వచ్చినామని మీరు భావించరాదు. ఇది పరాయి పనిగా మీరు భావించరాదు. దీనిని మీ స్వంత ఇల్లుగాను, ఇది మీ స్వంత పనిగాను మీరు భావించాలి.

కర్ణాటక ప్రభుత్వమువారు,సేవాసంస్థలవారుకూడా చాలా శ్రమలకోర్చి అనేక సదుపాయములను సమకూర్చారు. ఎన్ని చేసినప్పటికీ మీ హృదయాలు, మీ భావాలు, మీ ఏకాగ్రత– ఒక్క స్వామి పైననే వుంటున్నవి. కనుక, స్వామిపై ఇంత నమ్మకముతో, విశ్వాసముతో ఇక్కడ చేరినవారి సౌకర్యములను చూసే బాధ్యత మాపైన కూడా వుంటున్నది. కనుక, మీరు ఇక్కడ వుండినంత కాలమూ మీరు భుజించిన ఆహారమునకు ధనము ఏమాత్రమూ ఇవ్వకూడదు. మన ఇంటికి వచ్చిన మన బిడ్డలకు అన్నం పెడితే దానికి ఛార్జీలు వసూలు చేస్తామా!ఇది మీ ఇల్లే. కనుక, ఇక్కడ మీరు దేనికైనా ఛార్జీలు ఇవ్వకూడదు. టిక్కట్లకోసం డబ్బు చెల్లించకూడదు. దీని బాధ్యతనంతా సెంట్రల్ ట్రస్టు భరించవలసి వుంటుంది. కనుక, ఇండియా సత్యసాయి ఆర్గనైజేషన్స్ ఛైర్మన్‌నుండి ఆహారం నిమిత్తమై ఏమైనా ధనము తీసుకొని వుంటే, దానిని ఎవరిది వారికి వాపస్ ఇవ్వాలని నేను ఆశిస్తున్నాను.

నాకు ధనముకాదు ప్రధానము, గుణము ప్రధానము. మీ ప్రేమకు ఇంత, అంత అని విలువ కట్టటానికి వీలుకాదు. ప్రేమకు విలువే లేదు. అలాంటి ప్రేమకు ఏరీతిగా విలువ కట్టగలము! నాకు కావలసింది మీ ప్రేమయే! మీ క్షేమమే! మీ అభివృద్ధియే! మీ ఆనందమే!

*love is my form*
*truth is my breath*
*bliss is my goal.*

మీ ఆనందమే నాకు కావాలి. కనుక, మీరు ఆనందంగా వుంటూ రేపటి దినముకూడా ఇక్కడే భోజనాలు చేసుకొని తిరిగి మీ అనుకూలములను బట్టి మీరు ప్రయాణమై వెళ్ళిపోవచ్చును. ఇక్కడ ఒక్క నయాపైసా మీరు చెల్లించకూడదని నేను ప్రేమతో ఆశీర్వదించి, అనుగ్రహించి ప్రబోధిస్తున్నాను.

మీరు వెళ్ళేముందుగా ఈ సంస్థల నియమము గురించి మీతో మరొక పర్యాయము సంప్రదిస్తాను. ఉత్తరోత్తరా ఈ సంస్థను ఏవిధంగా అభివృద్ధి పరచాలి, ఏవిధమైన మార్గంలో మనము నడచుకోవాలి, మానవత్వపు విలువను ప్రజలలో ఏరీతిగా చాటాలి, ఏరీతిగా అనుభవించాలి అనే విషయాలను మనం సంప్రదించవలసి వస్తుంది. కనుక, మీకు ప్రత్యేకంగా కాలమును కేటాయించి మీతో మరొక పర్యాయం నేను సంభాషించి మీకు సరియైన ఆనందాన్ని అందిస్తాను.

(1994 జూలై 21వ తేదీ బృందావనంలో బాలవికాస్ గురువులకు భగవాన్ బాబావారి దివ్యసందేశము)